

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

## ప్రజా సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం

- సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర రాజధానిలో తక్కువ.. దేశ రాజధానిలో ఎక్కువ
- ఏడు నెలలైనా అమలు కాని కాంగ్రెస్ హామీలు
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల, జూలై 7 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర రాజధానిలో కన్నా దేశ రాజధానిలోనే ఎక్కువగా ఉంటున్నాడని, ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలైనా ముఖ్యమంత్రికి ప్రజా సమస్యలపై అవగాహన రాలేదని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లిలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి అంటే రాష్ట్ర రాజధానిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ పరిపాలన సాగించాలని, కానీ రేవంత్‌రెడ్డి అందుకు భిన్నంగా దేశ రాజధానిలోనే ఎక్కువగా కనిపిస్తున్నారని అన్నారు. ఏడు నెలలైనా ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని తెలిపారు. కేసీఆర్ పాలనలో రైతులు ఆనందంగా ఉన్నారని, 24 గంటల ఉచిత కరెంట్, నారు వేసే సమయానికి రూ. 10 వేల పంట పెట్టుబడి సాయం, సకాలంలో ఎరువులు అందాయని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో పెట్టుబడి సాయం అందక, నాణ్యమైన కరెంట్ లేక, ఎరువులు దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రైతులను మోసం చేసిన వారికి పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. సకాలంలో వర్షాలు లేక సాగు నీరు, తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుంటే కనీసం అధికారులతో సమీక్ష నిర్వహించ లేని పరిస్థితిలో సీఎం ఉన్నారని విమర్శించారు. నిరుద్యోగ సమస్యలపై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని, నిరుద్యోగులకు రూ. 3వేల భృతి ఇస్తామని మాట తప్పారని, సకాలంలో పింఛన్లు ఇవ్వడంలేదని అన్నారు. నార్కట్‌పల్లి ఎస్‌ఐ లేని సమస్యలు సృష్టించి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో అంతటి వెంకటేశ్, మాజీ ఎంపీటీసీ కోయగూర నర్సింహ, బీఆర్‌ఎస్ గుండ్రాంపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు బత్తుల నర్సింహ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

## ప్రతిపక్షాల అణిచివేతకు కాంగ్రెస్ కుట్ర

- ఎమ్మెల్యే సామేల్ చేసిన శపథానికి కట్టుబడి ఉండాలి
- బీఆర్‌ఎస్ యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

మోత్కూరు, జూలై 7 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధి పట్టకుండా ప్రతిపక్షాల అణిచివేతకు కుట్ర చేస్తున్నదని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని దత్తప్పగూడెంలోని తన నివాసంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నదన్నారు. ప్రజా పాలనను విస్మరించి ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులపై అవిశ్వాసాలు పెట్టి రాజకీయ కక్ష తీర్చుకుంటుందని పేర్కొన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఎన్నికల సమయంలో ఇసుక రవాణా విషయంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై, అప్పటి ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్‌పై ఆరోపణలు చేశారని, తాను ఎమ్మెల్యేగా గెలిస్తే నియోజకవర్గం నుంచి తట్టెడు ఇసుకను పోనివ్వనని చేసిన శపథానికి కట్టుబడి ఉండాలని రామకృష్ణారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని మూసీ, బిక్కేరు వాగుల నుంచి విచ్చలవిడిగా ఇసుక మాఫియా జరుగుతున్నా ఎందుకు తప్పించుకుంటున్నారని ప్రశ్నించారు. తన ఇద్దరు కొడుకులకు లారీలను కొనిచ్చి ఎమ్మెల్యే సామేల్ ఇసుక మాఫియాను ప్రోత్సహిస్తున్నారని అన్నారు. నియోజకవర్గం నుంచి ఇసుక తీసుకు పోనివ్వకుండా బీఆర్‌ఎస్ అడ్డుకుంటుందని, అవసరమైతే మంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.

## రెండో రోజు 640మంది ఎప్‌సెట్ విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన

రామగిరి, జూలై 7 : తెలంగాణలోని ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన టీఎస్ ఎప్‌సెట్ ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ చేసుకున్న విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన రెండో రోజు ఆదివారం నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కొనసాగింది. సర్టిఫికెట్ల పరిశీలనకు ఉదయం నుంచి సాయంత్రం వరకు 640 మంది విద్యార్థులు వివిధ ప్రాంతాల నుంచి హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జానకిదేవి, కో ఆర్డినేటర్ సుధాకర్ వెల్లడించారు.



సర్టిఫికెట్లు పరిశీలించిన విద్యార్థులకు పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ జానకిదేవి, కో ఆర్డినేటర్ సుధాకర్

# చెరువు మట్టి లూటీ

- ఇటుక బట్టీలకు యథేచ్ఛగా తరలింపు
- పదుల సంఖ్యలో జేసీబీలు.. 50కిపైగా ట్రాక్టర్లతో దోపిడీ
- సెలవు దినాల్లో రెచ్చిపోతున్న అక్రమార్కులు

### దిర్శించర్ల చెరువులో ఇష్టానుసారంగా తవ్వకాలు

నేరేడుచర్ల, జూలై 7 : అన్నదాతలకు సాగు నీరు అందించే చెరువులను కొంత మంది అక్రమార్కులు చెరపడుతున్నారు. ఇష్టానుసారంగా రాత్రి పగలు అనే తేడా లేకుండా తవ్వకాలు చేపడుతున్నారు. అనుమతులు లేకుండా పదుల సంఖ్యలో జేసీబీల సాయంతో నిత్యం వందలాది ట్రాక్టర్లతో చెరువు మట్టిని ఇటుక బట్టీలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల ఊర చెరువు నుంచి జేసీబీలతో ఇష్టానుసారంగా గుంతలు పెట్టి తవ్వుతున్నారు. కుప్పలుగా పోసి ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గతంలో ఇదే చెరువును కొంత మంది ఆక్రమించుకుంటున్నారని నమస్తే తెలంగాణలో వార్త ప్రచురితం కాగా ఐబీ, రెవెన్యూ అధికారులు వెళ్లి హద్దులను గుర్తించి కొంత మంది ఆక్రమణ దారులపై కేసులు పెట్టారు. ఇటీవల చెరువు నుంచి మట్టిని తరలిస్తుంటే గ్రామస్తులు, చెరువు సంఘం సభ్యులు అడ్డుకోవడంతో ఒక ట్రెండు రోజులు నిలిపివేశారు. అధికారులు ఎవరూ ఆదివారం అందుబాటులో ఉండరనే విషయాన్ని గమనించిన దళారులు అక్రమ మట్టికి తెరలేపారు. దీని కోసం కనీసం 10కి పైగా జేసీబీలు, 50కి పైగా ట్రాక్టర్లను పెట్టి చెరువు మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు.



నేరేడుచర్ల మండలం దిర్శించర్ల చెరువులో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు



దిర్శించర్ల చెరువులో తవ్విన మట్టిని ట్రాక్టర్లలో తరలింపు

### యేటా ఇదే సమయంలో..

ఇటుక బట్టి యజమానులు ఎటువంటి అనుమతులు లేకుండా ప్రతి సంవత్సరం జూన్, జూలై మాసాల్లోనే అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. ఒక్క దిర్శించర్ల చెరువు కాదు మండలంలోని అనేక చెరువుల్లో ఇదే తంతు కొనసాగుతున్నట్లు సమాచారం. ప్రభుత్వం చెరువు మట్టిని రైతు పొలాల్లోకి తోలుకోవచ్చని సూచించడంతో ఇదే అదునుగా దళారులు, ఇటుక బట్టి యజమానులు ఇష్టానుసారంగా మట్టిని తరలిస్తున్నారు. నిరంతరం మట్టి ట్రాక్టర్లు రోడ్డుపై నుంచి వెళ్తుండడంతో దుమ్ముతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా చెరువులో ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టడంతో భారీ గోతులు ఏర్పడి నీరు నిలిచి అందులో మూగజీవాలు పడి చనిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాక్టర్ల రాకపోకల వల్ల చెరువు గట్టు సైతం దెబ్బతింటున్నాయని చెరువు యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా చెరువు మట్టిని తరలిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని పలువురు కోరుతున్నారు.

### మట్టి తరలింపునకు అనుమతులు లేవు

చెరువు మట్టి తరలింపునకు ఎవరికీ ఎటువంటి అనుమతులు లేవు. కొంత మంది దళారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ చెరువులో మట్టి తవ్వకాలు చేయడంతో పెద్ద గుంతలు పడ్డాయి. రైతులు తమ పొలాల్లో చెరువు మట్టి పోసుకోవడానికి ఎటువంటి అభ్యంతరం లేదు. కానీ గుంతలు పెట్టకుండా చదునుగా ఒక లెవల్‌లో ఎత్తుకోవాలి. అంతేకానీ ఇటుక బట్టీలకు తరలిస్తే వారిపై కేసులు నమోదు చేస్తాం. అక్రమంగా మట్టిని తరలించకుండా తమ సిబ్బందితో పర్యవేక్షిస్తాం.

**-అమరేందర్ రెడ్డి, డీఈ, నీటిపారుదల శాఖ, నేరేడుచర్ల**

### సూర్యక్షేత్రాన్ని సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి


అర్వపల్లి, జూలై 7 : మండల పరిధిలోని తిమ్మాపురం సూర్యక్షేత్రం, అర్వపల్లి యోగానందలక్ష్మి నర్సింహస్వామి ఆలయాన్ని సూర్యాపే జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.గోవర్ధన్ రెడ్డి కుటుంబ సమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్ర వ్యవస్థాపకులు జనార్దనస్వామి ఆయన్ను సన్మానించారు.



సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తిని సన్మానిస్తున్న సూర్యక్షేత్ర వ్యవస్థాపకులు

# ఇష్టారాజ్యంగా అర్చక నియామకాలు!

- దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ గుడిలో నోటిఫికేషన్ రహిత పోస్టుల భర్తీకి సన్నద్ధం
- ఓ వర్గానికి కొమ్ముకాసేలా చక్రం తిప్పుతున్న దేవాదాయ శాఖ, దేవస్థానం అధికారులు
- ఇదే తరహాలో దేవస్థానం ఆదాయానికి గండి కొడుతున్నట్లు విమర్శలు



రామగిరి, జూలై 7 : దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో ఉండే ఆలయాల్లో ఏ పనులు చేయాలన్నా, కొత్త వారిని నియమించాలన్నా ఉన్నతాధికారుల ఉత్తర్వులు లేదంటే నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది. కానీ.. కనగల్ మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అవేమీ లేకుండా గుట్టుచప్పుడు కాకుండా అర్చక పోస్టులు భర్తీ చేయాలని దేవస్థానం, దేవాదాయ శాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. వాస్తవానికి ప్రభుత్వ పరిధిలోని సంస్థలో నియామకాలు చేయాలంటే నోటిఫికేషన్ ద్వారా అర్హులైన వారిని నిబంధనల మేరకు నియమించాలి. దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ దేవస్థానంలో ఇప్పటికే ఏడుగురు అర్చకులు పని చేస్తుండగా.. మరొకరు డిప్యుటేషన్‌పై వచ్చారు. అయితే.. ఆలయానికి భక్తుల రద్దీ పెరుగడం, ఆదాయం అధికంగా వస్తుండడంతో రాష్ట్ర దేవాదాయ శాఖ మరో రెండు అర్చక పోస్టులను గుట్టుచప్పుడు కాకుండా మంజూరు చేయించినట్లు సమాచారం. వాస్తవానికి దేవాదాయ ధర్మాదాయ శాఖ నుంచి నోటిఫికేషన్ జారీ చేసి అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించి నిబంధనల మేరకు భర్తీ చేయాల్సి ఉంది. కానీ.. వాటిని తుంగలో తొక్కి దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా కార్యాలయంలో ఓ అధికారి సూచనతో ఆలయ అధికారులు నియామక ప్రక్రియను పూర్తి చేయాలనే ఆలోచనతో మంతనాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయం ఆలయ అర్చకులకు తెలియడంతో తమ వర్గానికి అవకాశం ఇవ్వాలని, స్థానికులకు ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేస్తుండటంతో విషయం బయటకు పొక్కింది.

### దేవాలయ ఆదాయానికి గండి..

దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ దేవస్థానానికి ఆదాయం పుష్కలంగా వస్తుంది. అయినప్పటికీ ఇక్కడ నిర్మాణాలు చేయాలంటే దాతల సహకారం తీసుకుంటున్నారు. దాతల సహకారంతో నిర్మాణాలు చేసినప్పటికీ.. చాలా వరకు పనులను దేవాలయ సొమ్ము నుంచే వాటి నిర్మాణాలు చేసినట్లు లెక్కల్లో చూపిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అమ్మవారికి వచ్చిన విరాళాలు, సమర్పించిన చీరెలు, నగదు, బంగారు, వెండి ఆభరణాలు సైతం మాయమవుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వీటిపై గతంలో చర్చ జరుగగా.. మళ్లీ అదే వ్యవహారం సాగుతున్నట్లు భక్తులు పేర్కొంటున్నారు. డిప్యుటేషన్‌పై వచ్చి ఏండ్ల తరబడి అర్చకులు ఎలా పనిచేస్తారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోపాటు ఇక్కడ పని చేసే అధికారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని సిబ్బంది పేర్కొంటున్నారు. వీటిపై పూర్తి స్థాయి విచారణ జరుపాలని డిమాండ్ చేస్తున్నారు.

### నోటిఫికేషన్ లేకుండా అర్చక పోస్టుల భర్తీ ఉండదు

దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఆధీనంలోని ఏ దేవాలయంలోనైనా అర్చకుల నియామకం జరుగాలంటే కచ్చితంగా నోటిఫికేషన్ జారీ చేస్తాం. నోటిఫికేషన్ లేకుండా అర్చక పోస్టుల భర్తీ జరుగదు. ఇప్పటి వరకు జిల్లా కార్యాలయం నుంచి ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. రాష్ట్ర దేవాదాయ శాఖ నిబంధనలు వస్తేనే వాటిని పరిగణలోకి తీసుకుంటాం. ఇప్పటి వరకు రాష్ట్ర దేవాదాయ శాఖ నుంచి అర్చకుల నియామకానికి జిల్లా కార్యాలయానికి ఉత్తర్వులు రాలేదు. వదంతులు నమ్మవద్దు. అలా చేసినా ఆ నియామకాలు చెల్లవు. అన్ని దేవాలయాలపై అధికారుల పర్యవేక్షణ ఉంటుంది. ఎక్కడైనా తప్పులు జరిగినట్లు తెలిస్తే విచారణ చేస్తాం. నేరం రుజువైతే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం.

**- కె.మహేందర్‌కుమార్, దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్**

# బస్వాపూర్ రిజర్వాయర్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు..!

## గుట్టుచప్పుడు కాకుండా భారీగా పారబోత

- అక్కడే గుట్టలుగా పోసి కాల్చేస్తున్న వైనం
- ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో పెను ప్రమాదం
- త్వరలో ఇక్కడి నుంచే జిల్లాకు నీటి సరఫరా
- పంట పొలాలు, ఇతర అవసరాలకు వినియోగం
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం

**అదో రిజర్వాయర్.. భవిష్యత్ తరాల కోసం సాగు, తాగునీటిని అందించేందుకు నిర్మించిన ప్రాజెక్టు. మరికొన్ని రోజుల్లోనే జిల్లా ప్రజలకు అందుబాటులోకి రానుంది. అలాంటి రిజర్వాయర్ కలుషితమవుతున్నది. రిజర్వాయర్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు పారబోస్తున్నారు. ఎక్కడి నుంచో గుట్టుచప్పుడు కాకుండా తీసుకొచ్చి పెద్దఎత్తున తరలిస్తున్నారు. గుట్టలు గుట్టలుగా పోస్తూ డంప్ చేస్తున్నారు. అంతే కాకుండా అక్కడే కాల్చివేస్తున్నారు. ఇది ఇలాగే కొనసాగితే పెను ప్రమాదం వాటిల్లే అవకాశం లేకపోలేదు.**

– యాదాద్రి భువనగిరి, జూలై 7 (నమస్తే తెలంగాణ)



బస్వాపూర్ రిజర్వాయర్‌లో డంప్ చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

యాదాద్రి భువనగిరి జిల్లాలో కాళేశ్వరం జలాలు పరవళ్లు తొక్కించేందుకు నాటి సీఎం కేసీఆర్ కంకణం కట్టుకున్నారు. ఇందుకోసం బస్వాపూర్ ప్రాజెక్టు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ 16వ ప్యాకేజీలో భాగంగా 11.39 టీఎంసీల సామర్థ్యంతో జిల్లాలోని భువనగిరి మండలంలో బస్వాపూర్ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం అప్పటి ప్రభుత్వం రూ. 1652.26 కోట్లు కేటాయించింది. ఇప్పటి వరకు రూ. 1250 కోట్ల పనులు పూర్తయ్యాయి. మొత్తం జలాశయం, ఎగువ, దిగువ కాల్వలు నిర్మించేందుకు 5,891 ఎకరాల భూసేకరణ చేపట్టారు. బీఆర్‌ఎస్ హయాంలోనే 90శాతం పనులు పూర్తయ్యాయి. ఇంత వరకు బాగానే ఉంది. రిజర్వాయర్‌లోకి కొందరు వ్యక్తులు ప్లాస్టిక్ వ్యర్థాలను తరలిస్తున్నారు. బండ్ లోపల హరిత వనం ప్లాట్లు కొంచె దూరంలో కుప్పలుకుప్పలుగా ప్లాస్టిక్ వ్యర్థాలు పోశారు. అంతే కాకుండా వ్యర్థాలను కాల్చేసే ప్రయత్నం చేశారు. ప్లాస్టిక్ కావడంతో సరిగా కాలిపోకుండా ఉన్నట్లు కనిపిస్తున్నది. పైపైన బూడిద మాదిరి కనిపిస్తున్నా లోపల మాత్రం ప్లాస్టిక్ వ్యర్థాలు అలాగే ఉన్నాయి. ఇటీవల వర్షాలు రావడంతో కుప్పలన్నీ ముద్ద ముద్దలుగా అయ్యాయి. దగ్గరకు వెళ్తే ఓ రకమైన వాసన వెదజల్లుతున్నది. ప్రస్తుతానికి ఇక్కడ నీళ్లు లేవు. అటు వైపు రిజర్వాయర్ బండ్ పనులు ఇంకా కొనసాగుతున్నాయి.

### త్వరలో ఇక్కడి నుంచే నీళ్లు

నృసింహసాగర్ రిజర్వాయర్‌తో యాదాద్రి భువనగిరి జిల్లాతో పాటు నల్లగొండ జిల్లాలోని పలు మండలాలకు సాగు, తాగు నీరు అందనుంది. ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే 2.5లక్షల ఎకరాలు సాగులోకి రానున్నాయి. జిల్లాలోని ఆలేరు, భువనగిరి నియోజవర్గాలతోపాటు మోత్కూరు, రామన్నపేట, చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాలు సస్యశ్యామలం కానున్నాయి. వ్యర్థాలు పోసిన చోట ఇంకా నీరు రాలేదు. త్వరలోనే రిజర్వాయర్‌లోకి నీటిని వదలనుండగా, అంతటా నీటితో నిండిపోనుంది. రిజర్వాయర్ నీటిని జిల్లాలో వివిధ అవసరాలకు వాడుకోనున్నారు.

### పెను ప్రమాదమే..

రిజర్వాయర్‌లో పోసిన వస్తువులన్నీ ప్లాస్టిక్ వ్యర్థాలే. ప్లాస్టిక్ కరుగదని అందరికీ తెలిసిందే. వందల, వేల సంవత్సరాలు అయినా భూమిలో అలాగే ఉండిపోతుంది. వీటిని రీసైకిల్ కూడా చేసే అవకాశం లేదు. ఇవి భూసారాన్ని నాశనం చేస్తాయి. ప్లాస్టిక్‌తో మానవాళితోపాటు జంతువులకు ప్రమాదం. మనిషి రక్తం, మెదడుపై ప్రభావం చూపుతుంది. అలాంటిది రిజర్వాయర్‌లో ప్లాస్టిక్‌ను డంప్ చేయడం వల్ల జిల్లా ప్రజలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. ఇక్కడే నీరు రోజుల తరబడి నిల్వ ఉండనుంది. ఆ నీటినే పంట పొలాలకు, ఇతర అవసరాలకు వినియోగించుకోనున్నారు. ప్లాస్టిక్‌తో కలుషితమైన నీటిని ఉపయోగించడం వల్ల ఎలాంటి పరిణామాలు వాటిల్లుతాయోనని ఆందోళన వ్యక్తమవుతున్నది. రిజర్వాయర్‌లో ప్లాస్టిక్ ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో మరింత ఇబ్బందులు తప్పవు.

### విచారణ చేసి.. చర్యలు తీసుకుంటాం..

రిజర్వాయర్‌లోకి ప్లాస్టిక్ వ్యర్థాలు తరలింపు ఇంకా మా దృష్టికి రాలేదు. ఎవరు తరలిస్తున్నారనేది తెలియదు. దీనిపై త్వరలోనే పూర్తి స్థాయిలో విచారణ చేస్తాం. బాధ్యులు ఎవరనేది తేలాక చర్యలు తీసుకుంటాం.

**- అంజిరెడ్డి, తాసీల్దార్, భువనగిరి**

### పర్యవేక్షణ కరువు.. పట్టించుకోని ప్రభుత్వం..

బీఆర్‌ఎస్ ప్రభుత్వం రిజర్వాయర్‌ను పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగింది. అన్ని విధాలుగా రిజర్వాయర్ నిర్మాణానికి సహకరించింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దీన్ని కనీసం పట్టించుకోవడంలేదు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఒక్క పైసా విడుదల చేయలేదు. ఇదిలా ఉంటే.. కనీసం రిజర్వాయర్‌లో ఏం జరుగుతుందో కూడా పర్యవేక్షించే తీరిక లేకుండా ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఇది అధికారులకు తెలిసే జరుగుతున్నదా..? లేక వారు పట్టించుకోవడంలేదా అనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.